I

సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



...పతకాలు పట్టారు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్ అండ్ వుమెన్ పోటీలు ఆదివారం అమలాపురంలో ఉత్కంఠ భరితంగా జరిగాయి.


II లో



విహార యాత్ర..విషాదాంతం

పుట్టిన రోజు వేడుక జరుపుకొందామని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం వచ్చిన యువకుల విహార యాత్ర విషాదాంతమైంది.

డెల్టాలకు 14,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 14,700 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాలకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

జయహో దుర్గాభవానీ



శ్రీ కనకదుర్గాదేవి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ అమ్మవారు

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆలయాల్లోని అమ్మవార్లు ఆదివారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాష్టమి సందర్భంగా శ్రీ కనక దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, సువర్ణ, రజత పుష్పార్చన నిర్వహించారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ముమ్మిడివరం ఆర్య వైశ్య సంఘం సత్రంలో నెలకొల్పిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.10లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. రాయవరం మండలం వెదురుపాకలోని విజయదుర్గాపీఠంలో దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

– నెట్‌వర్క్



ముమ్మిడివరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి



దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన వెదురుపాక విజయదుర్గ అమ్మవారు

న్యూస్‌రీల్

నరసన్న సన్నిధిలో ఏసీబీ డీఐజీ రామకృష్ణ



ఏసీబీ డీఐజీ రామకృష్ణకు చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఏపీ రాష్ట్ర ఏసీబీ డీఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు సుదర్శనం రమేష్ స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదం, చిత్రపటాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

వినాయకుడికి పంచ పాత్ర, వెండి ఉద్ధరిణి సమర్పణ



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవి, అర్చకునికి వెండి వస్తువులను అందజేస్తున్న దాత

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల వినాయకుడి ఆలయానికి పట్టణానికి చెందిన ర్యాలి బుజ్జి, పుణ్యవతి దంపతులు 495 గ్రాముల పంచ పాత్ర, వెండి ఉద్ధరిణి ఆదివారం సమర్పించారు. పట్టణానికి చెందిన తటవర్తి సర్వేశ్వర రావు, నాగ పద్మావతి దంపతులు 248 గ్రాముల వెండి పాదుకలను ఆలయానికి సమకూర్చారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబులకు ఈ వెండి వస్తువులను ఆలయంలో అందించారు. దాతలకు స్వామివారి చిత్ర పటాలను అందించి సత్కరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకోల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 62 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 489 మంది భక్తులు, శ్రీ లక్ష్మీగణపతి హోమంలో 38 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 14 మంది చిన్నారులకు నామకరణం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, తులాభారం వంటివి నిర్వహించారు. 21 మందికి నూతన వాహన పూజ నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,24,375 ఆదాయం లభించిందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

మాధ్యమిక విద్యకు మంచి రోజులు

- నాడు–నేడుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి
- జిల్లాలో 10 కళాశాలలకు రూ.7.10 కోట్ల కేటాయింపు
- చురుగ్గా సాగుతున్న నాడు–నేడు పనులు

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యపై పెట్టే పెట్టుబడి భావితరాలకు మేలు చేస్తుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావిస్తున్నారు. అందుకే విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గత నాలుగున్నరేళ్లలో మనబడి నాడు–నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. మొదటి దశలో పాఠశాలలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం రెండవ దశలో ఇంటర్మీడియెట్ విద్యపై కూడా దృష్టి సారించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. తద్వారా పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు ప్రభుత్వం కృషి చేస్తోంది.



నాడు-నేడు పనులు పూర్తి చేసుకున్న పామర్రు జూనియర్ కళాశాల



డ్యూయల్ డెస్క్‌లపై రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. ఆలమూరు, అమలాపురం, కొత్తపేట, మామిడికుదురు, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురం, పామర్రు, రాజోలు, రావులపాలెంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. ఈ కళాశాలల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.7.10 కోట్లను మంజూరు చేసింది. అందులో భాగంగా రివాల్వింగ్ ఫండ్ కింద అభివృద్ధి పనులకు రూ.2,51,99,973 ఇప్పటికే విడుదల చేసింది. మిగిలిన సొమ్ముతో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్ కింద మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నారు.



నాడు-నేడు పనులు జరుగుతున్న రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల

మౌలిక వసతుల కల్పన

నాడు–నేడు పథకంలో భాగంగా కళాశాలల్లో బాలికలకు టాయిలెట్స్, మేజర్ అండ్ మైనర్ మరమ్మతు పనులు, తరగతి గదులతో పాటుగా ఉన్న టాయిలెట్స్ అభివృద్ధి, తాగునీటికి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ చాక్‌బోర్డులు, ఫ్యాన్లు, విద్యుద్దీకరణ, తరగతి గదులకు లోపల, బయట ఆకర్షణీయమైన రంగులు, ప్రహరీల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుతో ఇంటర్మీడియెట్ కళాశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే జిల్లాలో 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. డిసెంబరు నాటికి మొత్తం పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తద్వారా మాధ్యమిక విద్యకు కూడా మంచి రోజులు వచ్చినట్లవుతుంది.

నిరంతర పర్యవేక్షణ



జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు పనులు వేగంగా సాగుతున్నాయి. నాణ్యతతో పనులు చేపడుతున్నాం. జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నాడు–నేడు పనులపై వీడియో కాన్ఫరెన్స్, వెబెక్స్‌ల ద్వారా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈవో, ఇంటర్మీడియెట్ విద్య, అమలాపురం

2 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 నుంచి 10 వరకు 9 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు ఆహ్వాన పత్రికతో పాటు పోస్టర్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను స్వామివారి వద్ద ఉంచి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు భక్తులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్త జనకోటి బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో నవమూర్తి ఆవాహన, ధ్వజారోహణ, శ్రీనివాస కల్యాణం, మహా సుదర్శన హోమం, అష్టదళ పాదపద్మారాధన, పారమాత్మిక ఉపనిషత్ పూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం, నవగ్రహ హోమం, తిరుప్పావడ సేవ, సంతాన గోపాలమూల మంత్ర పూర్వక హోమం, సామూహిక కుంకుమార్చన, మహాలక్ష్మి మూల మంత్ర పూర్వక మహలక్ష్మి హోమం, మహాపుష్పయాగం, మహా పూర్ణాహుతి, అవభృథస్నానం, చూర్ణోత్సవం, మహదాశీర్వచనం, తదితర ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించాల్సిన అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలు రద్దు చేశామన్నారు. బ్రహ్మోత్సవ ఆర్జిత సేవలకు రూ1,116 చెల్లించే భక్తులు నగదు, డీడీలు, మనీయార్డర్లు ఈవో, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం, వాడపల్లి, ఆత్రేయపురం మండలం చిరునామాకు పంపి రశీదు పొందాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

బహిరంగ వేలం జరిగేనా ?

- స్టే కోసం వ్యాపారుల యత్నం
- మండపేటలోని డీసీసీబీ స్థలం వ్యవహారం

మండపేట: పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) కు చెందిన స్థలం బహిరంగ వేలం నిర్వహణ చర్చనీయాంశంగా మారింది. ఈనెల 25న వేలం వేసే పనిలో డీసీసీబీ అధికారులు ఉండగా స్టే తెచ్చేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కు మండపేట మెయిన్ రోడ్డులో 457/1 సర్వే నంబర్‌లో 33 సెంట్ల స్థలం ఉంది. రోడ్డు వైపున దుకాణాలు, వెనుక వైపున రెండు గోడౌన్లు ఉన్నాయి. గతంలో డీసీసీబీ నుంచి డీసీఎంఎస్ తీసుకున్న రూ.1.9 కోట్ల రుణం తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో 2009లో ఈ స్థలాన్ని వేలం వేసేందుకు నిర్ణయించారు. కాగా విలువైన స్థలాన్ని తక్కువ ధరకు కాజేసేందుకు కొందరు కుమ్మక్కయ్యారని అభ్యంతరాలు రావడంతో వేలం వాయిదా వేసి డీసీసీబీ ఈ స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకుంది. తాజాగా ఈనెల 25న కాకినాడలోని తమ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహణకు డీసీసీబీ అధికారులు చర్యలు చేపట్టారు. 33 సెంట్ల స్థలానికి రూ.మూడు కోట్లు ధర నిర్ణయించారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 లక్షలు ధరావత్తు చెల్లించాలి. కాగా ఈ స్థలంలోని దుకాణాలను అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో గతంలో మాదిరి మరలా వేలం వాయిదా పడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

ఖాళీ చేయించుకునే బాధ్యత పాటదారులదే

స్థలంలో ఉన్న షాపులను డీసీఎంఎస్ కొందరికి అద్దెకివ్వగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వేలం నిర్వహించే ముందు డీసీసీబీ వారిని ఖాళీ చేయించాల్సి ఉంది. కాగా తమ హక్కుపై వ్యాపారులు కోర్టును ఆశ్రయిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వారిని ఖాళీ చేయించకుండానే వేలం నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వేలంలో స్థలం దక్కించుకున్న వారు షాపులను ఖాళీ చేయించుకోవాలని అధికారులు అంటున్నారు. అధిక మొత్తం వెచ్చించి వేలంలో స్థలం దక్కించుకున్నా షాపులను ఖాళీ చేయించే సమయంలో వ్యాపారులు కోర్టును ఆశ్రయిస్తే ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయా కారణాలతో బహిరంగ వేలం నిర్వహణ పట్టణంలో చర్చనీయాంశమైంది. కాగా బహిరంగ వేలానికి సంబంధించి అధికారులు మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. వేలం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, స్థలం దక్కించుకున్న వారే షాపులు ఖాళీ చేయించుకోవాల్సి ఉందని నోడల్ అధికారి హనుమంతరావు తెలిపారు.

ప్రదక్షిణ దర్శనం.. మరింత ప్రత్యేకం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

- నేటి నుంచి కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ, గంధపు గిన్నె ఏర్పాటు
- నేడు సత్యదేవునికి ముత్తంగి సేవ

అన్నవరం: విజయ దశమి పర్వదినం సందర్భంగా సోమవారం నుంచి సత్యదేవుని ప్రదక్షిణ దర్శనం మరింత విశిష్టతను సంతరించుకోనుంది. ప్రదక్షిణ దర్శన మార్గంలో బంగారు గంధపు గిన్నె, బంగారు హుండీ, బంగారు కల్పవృక్షం, బంగారు కామధేనువులను సోమవారం ఏర్పాటు చేయనున్నారు. దాత, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణరెడ్డి (పెదబాబు) రూ.25 లక్షల వ్యయంతో తన తండ్రి సత్తి సుబ్బారెడ్డి పేరిట తయారు చేయించి వీటిని సమర్పించారు. భక్తులు ప్రధానాలయంలో ప్రదక్షిణ చేస్తూ వీటిని దర్శించిన అనంతరం, సత్యదేవుని దర్శించే అవకాశం కల్పించనున్నారు. సత్యదేవుని ప్రదక్షిణ మార్గంలో ఆగ్నేయాన బంగారు చందనపు పాత్ర (గంధపు గిన్నె) ఏర్పాటు చేయనున్నారు. అభిషేకం చేసిన గంధం ఈ గిన్నెలో వేస్తారు. నైరుతి దిక్కులో లక్ష్మీదేవి ప్రతిరూపమైన బంగారు హుండీ, వాయవ్య దిశన బంగారు కల్పవృక్షం, ఈశాన్యంగా బంగారు కామధేనువు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీటిని దర్శించి గంధపు గిన్నెలో గంధం నుదుటిన ధరించి, బంగారు హుండీలో కానుకలు సమర్పించి, కల్పవృక్షం, కామధేనువును దర్శించిన అనంతరం స్వామివారిని దర్శించాలని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ కోరారు. రూ.300 టికెట్టుతో ఈ ప్రదక్షిణ దర్శనం ఏర్పాటు చేసిన విషయం విదితమే. సోమవారం దసరా పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు ముత్యాల వస్త్రాలు ధరించిన ముత్తంగి సేవలో దర్శనమీయనున్నారు.

40 వేల మంది భక్తుల రాక

రత్నగిరికి ఆదివారం 40 వేల మంది భక్తులు తరలివచ్చారు. సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 2,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ, చేసి గోపాలుడిని దర్శించారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి సుమారు రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షించారు.

కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పుష్పమణి

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా డి.పుష్పమణి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా పుష్పమణి ఈ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంగా పనిచేస్తున్న పుష్పమణి ఈ జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక ఇప్పటి వరకూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టు నియామకం జరగలేదు. కొత్త జిల్లాలు ఏర్పాటైన ఏడాదిన్నర తర్వాత ఈ పోస్టు నియామకం ఇప్పుడు జరిగింది. పుష్పమణి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాతో కేఆర్‌ఆర్‌సీ విధులను నిర్వహిస్తారు. జిల్లాలోని భూ సంస్కరణలు, అసైన్డ్ భూములు వ్యవహారాలను పర్యవేక్షిస్తారు.

గుంటూరు జెడ్పీ సీఈవోగా వసంతరాయుడు

ఇప్పటి వరకూ జిల్లా కేంద్రం అమలాపురం ఆర్డీవోగా పనిచేసిన ఎస్‌వీబీఎస్ వసంతరాయుడు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆయనను గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

క్లుప్తంగా

కుటుంబ వేడుకలా విజయదశమి

ఆంధ్రా సుగర్స్ చైర్మన్, ఎండీ నరేంద్రనాథ్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ముళ్లపూడి నరేంద్రనాథ్ చౌదరి

తణుకు: ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ఏటా దసరా ఉత్సవాలను కుటుంబ వేడుకల్లా నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో స్థానిక సిల్వర్ జూబ్లీ పార్కులో జరిగిన వేడుకలకు ఆయన అధ్యక్షతన వహించి మాట్లాడారు. ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. సంస్థ అడిషనల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్ మాట్లాడుతూ అంతరిక్షంలో ప్రయోగించే రాకెట్లకు ఉపయోగపడే ఇంధనం ఇక్కడి నుంచే సరఫరా చేయడం గర్వకారణం అన్నారు. చరిత్రాత్మక మిషన్ చంద్రయాన్–3, గగనయాన్ ప్రాజెక్టులో భాగస్వాములైనందుకు గర్విస్తున్నామన్నారు. సినీనటుడు వెల్లంకి నాగినీడు, వాస్తు, జ్యోతిష ప్రవీణ, అష్టావధాని డాక్టర్ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ, సంస్థ జీఎం (హెచ్‌ఆర్) ఎ.సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన వ్యక్తిని పరిశీలిస్తున్న పోలీసులు

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ ఆదివారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..పిఠాపురం–గొల్లప్రోలు రైల్వేస్టేషన్ల మధ్య పిఠాపురం నుంచి తుని వైపు వస్తున్న రైలు కింద పడి 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలకు 9494887786, 9490619020 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విహార యాత్ర..విషాదాంతం

- గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యం
- కాకినాడ జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు

తాళ్లరేవు: పుట్టినరోజు వేడుకను జరుపుకుందామని పశ్చిమగోదావరి జిల్లా తణుకు నుంచి కేంద్రపాలిత ప్రాంతమైన యానాంకు వచ్చిన యువకుల విహారయాత్ర విషాదాంతమైంది. గోపులంక వద్ద గోదావరిలో గల్లంతైన పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన హనుమకొండ కార్తీక్, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. తణుకు సజ్జాపురంలోని ఒకే వీధికి చెందిన ఏడుగురు యువకులు శనివారం బర్త్‌డే పార్టీకి యానాం వచ్చి తిరిగి వెళుతూ గోపులంక వద్ద స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. శనివారం రాత్రి 10 గంటల వరకు కొనసాగించిన గాలింపు చర్యలు, తిరిగి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభించారు. కాకినాడ, జగన్నాథపురం అగ్నిమాపక శాఖలకు చెందిన సుమారు 10 మంది సిబ్బందితోపాటు, 21 మంది ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. యువకులు స్నానానికి దిగిన ప్రాంతానికి సమీపంలోనే మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక మత్స్యకారులు కట్టిన వలలకు గణేష్, బాలాజీ మృతదేహాలు చిక్కుకోగా మిగిలిన రెండు మృతదేహాలను సుమారు మూడు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. ఆయా మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల రోదనలతో గోపులంక ప్రాంతంలో విషాదం నెలకొంది. చేతికి అందివచ్చే సమయంలో యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మానవత్వం చాటిన సీఐ శ్రీనివాస్

నదిలో గల్లంతైన యువకుల మృతదేహాలను వెలికితీసేందుకు ఎంతగానో శ్రమించిన స్థానిక మత్స్యకారులకు కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాస్ రూ.5వేల నగదు ఇచ్చి మానవత్వాన్ని చాటారు. యువకులు గల్లంతైనప్పటి నుంచి మత్స్యకారులు వెన్నంటే ఉండి గాలింపు చర్యలు చేపట్టడంతోపాటు మృతదేహాలను వెలికితీయడంలో సిబ్బందికి సహకరించారని సీఐ అభినందించారు.



గోదావరిలోంచి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది



కుమారుడు మృతితో బోరున విలపిస్తున్న సాయి కార్తీక్ తండ్రి విజయ్‌కుమార్

స్కూబా డైవింగ్ నిపుణుడు ప్రకాష్‌బాబు సాహసం



ప్రకాష్ బాబు

యువకుల మృతదేహాలను వెలికితీయడంలో కొవ్వూరు ఫైర్‌స్టేషన్ స్కూబా డైవింగ్ నిపుణుడు ప్రకాష్ సాహసం చేశారు. ఆక్సిజన్ సాయంతో సుమారు 70 అడుగుల లోతులో మూడు గంటల పాటు శ్రమించడంతో కార్తీక్, రవితేజ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా ప్రకాష్‌ను అగ్నిమాపకశాఖ డీఎఫ్ఓ సురేంద్రన్, ఏఎఫ్ఓ సిబ్బంది అభినందించారు.

కన్నవాళ్లను కన్నీళ్లలో వదలి..

నాలుగు కుటుంబాలకు కొడుకులు దూరం

కాకినాడ క్రైం: తమ కడవరకు తోడుండి వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాచుకుంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు గంగపాలై మృత్యు ఒడికి చేరితే కన్నీళ్లే దిక్కయ్యాయి ఆ తల్లిదండ్రులకి. పున్నామ నరకం నుంచి తప్పిస్తాడనుకున్నారే గానీ రెండు పదుల ప్రాయం దాటిన రెండేళ్లకే నూరేళ్లు నిండిపోతాయని కల్లోనైనా ఊహించలేదు వాళ్లు. తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్‌ఘాట్ గౌతమి గోదావరి తీరం విషాదాంతాన్ని లిఖించింది. బంగారు భవిత కోసం కొండంత ఆశతో ఇప్పుడిప్పుడే తమ జీవితాలను ప్రారంభిస్తున్న నలుగురు యువకుల ఆయువులు తనలో కలిపేసుకొని ఆ నాలుగు కుటుంబాల్లో పెను విషాదాన్ని మిగిల్చింది.

స్వస్థలాలకు మృతదేహాలు

కాకినాడ జీజీహెచ్‌లో ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. తాళ్లరేవు, తణుకు ఎంఆర్‌వోలు మార్చురీ వద్ద ఉండి పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించి స్వగ్రామాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. నలుగురి యువకుల మృతదేహాలను రెండు మహాప్రస్థానం వాహనాల్లో స్వస్థలాలకు చేర్చారు.



పోస్టుమార్టం అనంతరం జీజీహెచ్ మార్చురీ నుంచి స్వస్థలాలకు మృతదేహాల తరలింపు

'అమ్మా.. నిన్ను చక్కగా చూసుకుంటాననేవాడు'



తణుకు మండలం సజ్జాపురం గ్రామంలో తల్లితో కలిసి నివసిస్తున్న పెండ్యాల బాలాజీ (21) ఏకైక కుమారుడు. తండ్రి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోతే ఇంటి బాధ్యతలు తల్లి వెంకటలక్ష్మి తీసుకున్నారు. స్థానిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. బాలాజీ చదువులో చురుకైనవాడు స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ట్రిపుల్ ఈ చదువుతున్నాడు. తన అక్క భావనలా మంచి ఉద్యోగం సంపాదిస్తానని తల్లికి చెప్పేవాడు. క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగం తప్పకుండా సాధిస్తానని భరోసా ఇచ్చేవాడు. తనకు ఉద్యోగం వస్తే నిన్ను ఇంట్లో పెట్టి చక్కగా చూసుకుంటానని తన తల్లితో అనేవాడని బాలాజీ మేనమామ బోయపాటి వెంకట సత్యనారాయణ కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు.

సొమ్మసిల్లిన కన్నతల్లి



కొడుకు చనిపోయాడన్న విషయం పోస్టుమార్టం పూర్తయ్యేవరకు ఆ తల్లికి తెలియకుండా దాచే ప్రయత్నం చేశారు కుటుంబ సభ్యులు. నీటిలో పడిపోయాడు అని తెలిసిన వెంటనే మృతుడు తిరుమల రవితేజ(20) తల్లి దేవి ఫిట్స్‌కు గురై ప్రమాదకర స్థితికి చేరుకున్నారు. దీంతో వైద్యులు మత్తు ఇచ్చి ఆమెను శాంతింపజేశారు. ఆదివారం సాయంత్రం కుమారుడి మృతదేహం ఇంటికి చేరే కొద్ది సమయానికి ముందు మత్తులో నుంచి మేల్కొని కొడుకు బాగోగుల కోసం ఆరా తీయగా లేడన్న చేదు నిజాన్ని బంధువులు ఆమెకు చెప్పారు. అంతే.. గుండెలు బాదుకొని దేవి పడిపడి ఏడ్చింది. ఆమెను సముదాయించడం ఎవరి వల్లా కాలేదు. ఆమె వేదనను చూసిన వారి కళ్లు చమర్చాయి. రవితేజకు యానిమేషన్ రంగం అంటే ప్రాణం అని హైదరాబాద్ వెళ్లి అదే రంగంలో ఉద్యోగం పొంది అక్కడే స్థిరపడతానని అనేవాడని చెబుతూ బంధువులు విలపించారు. రవితేజ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లాలోని పైడిపర్రు గ్రామం. డిగ్రీ పూర్తి చేశాడు. తణుకు రైల్వేస్టేషన్ సమీపంలో నివసిస్తున్నాడు.

అయ్యప్పా... ఏంటీ ఘోరం...



తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన అనుమకొండ విజయ్‌కుమార్ దంపతులకు సాయి కార్తీక్(20) ఒక్కగానొక్క కుమారుడు. స్థానిక సోనోవిజన్ షోరూంలో పనిచేస్తూ కుమారుడిని విజయ్ ఇంజినీరింగ్ చదివిస్తున్నారు. కుమారుడి మరణానికి ఒక్క రోజు ముందు విజయ్ అయ్యప్పమాల వేశారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం కన్నబిడ్డ మృతదేహాన్ని చూస్తూ అయ్యప్పా అంటూ దేవుడిని స్మరిస్తూ ఏంటీ ఘోరమని కన్నీటి పర్యంతమైన తీరు హృదయాల్ని కదిలించింది. రెండేళ్లలో మంచి ఉద్యోగం సాధించి తన కోసం తన చిన్నప్పటి నుంచి కష్టించి పనిచేస్తున్న తండ్రి రుణం తీర్చుకుంటాననీ, మంచి ఉద్యోగం సాధించి అపాయింట్‌మెంట్ లెటర్ చేతిలో పెట్టి సర్‌ప్రైజ్ చేస్తానని చెప్పేవాడని తోటి స్నేహితులు కన్నీళ్లు నిండిన కళ్లతో కార్తీక్ మాటల్ని గుర్తు చేసుకున్నారు.

దర్జీ కొడుకు ఇంజినీరు అనిపించుకోవాలని....



దర్జీ కొడుకు ఇంజినీరు అయ్యాడు అనిపించుకుంటా అని ముద్దన ఫణీంద్ర గణేష్(20) అంటూండేవాడని అతడి సహ విద్యార్థులు చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. జీవనోపాధి కోసం తండ్రి దుబాయ్ వెళ్లి అక్కడ దర్జీగా జీవనాన్ని కొనసాగిస్తూ భార్యాబిడ్డల కోసం కష్టపడుతున్నాడు. తణుకులో నివాసం ఉండే గణేష్ స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో బీ టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. జీవితం కోసం ఎన్నో కలలు కంటూ తండ్రి కష్టాన్ని చెరిపేస్తానని.. తన భర్త ఎలా ఉన్నాడో అంటూ తలుచుకుంటూ బాధపడుతుండే తల్లి ధనలక్ష్మితో అనేవాడని మావయ్య సాయికృష్ణ ఆవేదన చెందారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ టెన్త్, ఇంటర్ మన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, B.Li.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, ఆత్రేయపురం. ఫోన్ : 99494 82757, 98495 82043 [V-2222]

Real Estate

REAL ESTATE

■ కాకినాడ, భానుగుడి, 80 అ॥లు మిలట్రీ రోడ్డులో దక్షిణం, స్మార్ట్‌సిటీ 80 అ॥లు రోడ్డులో E/F కమర్షియల్ స్థలములు, శ్రీరామ్ నగర్, శ్రీనగర్, మాధవనగర్‌లలో కలవు. P.A. స్వామి. ✆ : 98481 07949. [R-121]

LAND FOR SALE

■ సామర్లకోట RAK సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఏడీబీ రోడ్ నుండి 2వ బిట్ 5.21 ఎకరాల భూమి (జగ్గమ్మ గారి పేట నందు) అమ్మకమునకు కలదు. ✆ : 92461 99099 [R-165]

■ కృష్ణాజిల్లా, హంసలదీవి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువులకు అనుకూలమైన 5 & 20 ఎకరాల మాగాణి భూమి అమ్మకమునకు కలదు. ✆ 99590 60109, 97013 66275 [B-1210037]

SITE FOR SALE

■ గజం 12,500/-లకే కాకినాడలో గుడా లే అవుట్ స్థలములు అమ్మబడును. (రామేశ్వరం – కొత్తూరు) సంప్రదించండి. ✆ : 99593 12379 [1171780]

LEASE

■ రాజమండ్రి ఏరియాలో Banquet Halls, Multi Cuisine Restaurant కలిగిన Hotel లీజుకు కావలెను. సంప్ర: Y.Sita Ram. Ph: 7842314025 [HA-12501]

PLOT FOR SALE

కాకినాడ, తూరంగి సూర్యానగర్‌లో 150 గ॥లలో బిల్డింగ్, వెంకట్‌నగర్‌లో స్థలం, పండూరు – చిత్రాడ హైవే ఫేసింగ్‌లో కమర్షియల్ స్థలం అమ్మకం. నో బ్రోకర్స్ ప్లీజ్ ✆ : 95500 58067 [R-171]

■ కాకినాడ ఈస్ట్ పాయింట్ కాలనీనందు (సురేష్ నగర్, శశికాంత్ నగర్‌ల నుండి VS Lakshmi College కి గల 100 Feet రోడ్‌కు) తూర్పు వైపు 33 అడుగుల సి.సి రోడ్ అనుకుని నూతనంగా నిర్మించిన పార్క్ ఎదురుగా, ఆదిత్య నర్సింగ్ కాలేజీకి ముందు సౌత్ ఫేసింగ్ 266.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-164]

మామిడి కలప కొరకు అమ్మకం

■ బిక్కవోలు రైల్వేస్టేషన్‌కు వాయువ్య దిశలో గల 10 యకరముల మామిడి తోట మొదలు కొట్టుకు అమ్మబడును. ✆ : 99482 90482 [R-1171781]

TO-LET

■ అద్దెకొరకు : రాజమండ్రి వెంకటేశ్వరనగర్ త్రిమూర్తి ఎన్‌క్లేవ్‌లో 1st Floor లో సెమి ఫర్నిష్‌డ్ 3 BHK Flat అద్దెకు కలదు. సంప్రదించండి. ✆ : 79037 57988 [R-6252]

Services

BUSINESS OFFER



■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

■ మహిళలకు ఒక అవకాశం : వ్యాపారంలో రాణించాలి అనుకుంటున్నారా ? మీ వ్యాపారం మరింత లాభాపాటికి పెట్టుబడి అవసరమా ? మమ్మల్ని సంప్రదించండి.. మీ వ్యాపార భాగస్వామిగా ఉంటూ మీకు అవసరం ఆయన పెట్టుబడి మేమే ఇస్తాము. షరతులు వర్తిస్తాయి. ఫోన్ : 95355 24005 [V-11216]

Wanted

■ రాజమండ్రి అర్బన్ రూరల్‌లో ప్ర॥ కం॥ ATM's షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు, సెక్యూరిటీ గార్డ్సు, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥ 12 to 15 వేలు రూం+భో రాజీ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 [R-130]

■ మా ఆఫీసు ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన ఆదాయం పొందండి. సంప్ర: 9177736926 [G-490]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000–40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7995365999 [HA-751]

■ ప్రముఖ కంపెనీలో జిల్లా/మండలాల వారిగా పనిచేయుటకు కో ఆర్డినేటర్లు కావలెను. Sal: 20,000 ఆపైన, Send Resume వాట్సాప్. ✆ 7330552222. [T-1177903]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ యందు రాజమండ్రిలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్ మరియు గార్డ్‌లు కావలెను. సంప్ర: ✆ : 74167 12755, 79930 12649 [R-1888]

■ APSRTC నందు కాంట్రాక్ట్ ఉద్యోగుల కొరకు నర్సాపురం, రాజోలు, రాజమండ్రిలో పనిచేయుటకు ఆయిల్ పంపుబాయ్స్, AC Bus అటెండర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. PF & ESI కలదు. ✆ : 94937 85599, 79933 21799 [R-1884]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బరువులు ఎత్తారు.. పతకాలు పట్టారు

ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన 150 మంది క్రీడాకారులు



పతకాలతో వుమెన్ విజేతలు. చిత్రంలో అతిథులు, జిల్లా లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీ రాజరాజేశ్వరి కల్యాణ మంటపంలో తోరం రమేష్ మెమోరియల్ మూడో యునైటెడ్ ఈస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్ అండ్ వుమెన్ పోటీలు ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ సాగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. బరువులు ఎత్తుతాం..పతకాలు సాధిస్తామనే పట్టుదల, ఆత్మ విశ్వాసం ఆ లిఫ్టర్లలో కనిపించింది. అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, పోటీల పర్యవేక్షకుడు, అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, మున్సిపల్ కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. మొత్తం 12 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. వుమెన్, మాస్టర్స్ విభాగాల్లో సాయంత్రానికి పోటీలు ముగిసినప్పటికీ మెన్ విభాగం పోటీలు అర్ధరాత్రి వరకూ కొనసాగనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు తెలిపారు.

వుమెన్, మాస్టర్స్ విభాగాల్లో విజేతలు వీరే

ఆదివారం రాత్రి వరకూ పోటీలు పూర్తయిన వుమెన్, మాస్టర్స్ విభాగాల విజేతలను పోటీల పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వుమెన్ విభాగంలో ఎం.శ్రీయ (ముమ్మిడివరం) బంగారు పతకాన్ని, పి.వందన (అమలాపురం) ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతాకాన్ని, యు.శశికళ (అమలాపురం) తృతీయ స్థానంతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. మాస్టర్స్ విభాగంలో సీహెచ్ కిరణ్‌కుమార్ (అమలాపురం) బంగారు పతకాన్ని, డీఆర్‌కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ) రజత పతాకాన్ని, బి.హేమ వెంకటరత్నం (అమలాపురం) కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. లిఫ్టర్లు 12 విభాగాల్లో 80 కిలోల నుంచి 200 కిలోల వరకూ బరువులు ఎత్తి సత్తా చాటారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లిఫ్టింగ్ నిపుణులు దొమ్మేటి వెంకటరమణ, ఎన్వీ సముద్రం, డీవీవీ సత్యనారాయణ, డి.లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

ఓబీసీ కుల గణన చేపట్టాలి

- వచ్చే నెల 19న శెట్టిబలిజ కార్తీక సమారాధన
- రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ కార్తీక వన సమారాధన వచ్చే నెల 19న పెద్దఎత్తున నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కేంద్ర గణాంక సంస్థ చేపట్టే జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ తీర్మానించారు. విద్యాపరంగా అభివృద్ధి చేయడానికి శెట్టిబలిజ సంఘాలను చైతన్య పరచాలని, వృత్తి, వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందడానికి శెట్టిబలిజ సంఘాలు మద్దతు తెలియజేయాలని కోరారు. శెట్టిబలిజ కార్పొరేషన్‌ను ఆర్థికంగా పరిపుష్టం చేసి దాని ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సంఘీయులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని, శెట్టిబలిజలు అధికంగా ఉండే ప్రతి నియోజకవర్గంలో విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడేలా కల్యాణ మంటపాలు నిర్మించాలని కోరుతూ తీర్మానించారు. తెలంగాణ శెట్టిబలిజలను బీసీల్లో చేర్చాలని పోరాటం చేస్తున్న అక్కడి శెట్టిబలిజ సంఘాలకు మద్దతు తెలియజేయాలని సమావేశం తీర్మానించింది. సంఘ నాయకులు అప్పారి జయప్రకాష్, న్యాయవాది ఇళ్ల శివప్రసాద్, అమలాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథరావు, మట్టపర్తి సత్యనారాయణ, కడలి కెరటాలు, దంగేటి వెంకట రామారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: ఓ ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చొరబడి రూ.6.20 లక్షల విలువ గల నగదు, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానిక కొత్తపేటలో నివశిస్తున్న తిరుమలరౌతు కృష్ణ కిర్లంపూడిలోని సినిమా చూసి, తిరిగి వచ్చే సమయానికి ఇంటిలో దొంగలు పడి, దోచుకుపోయారు. పోలీసుల కథనం మేరకు కృష్ణ భార్య, పిల్లలు దసరా సెలవులు కావడంతో గ్రామాంతరం వెళ్లారు. ఒంటరిగా ఉన్న కృష్ణ ఇంటి తలుపులకు తాళం వేసుకుని, కిర్లంపూడిలో రెండవ ఆట సినిమాకి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తాళం బద్దలు కొట్టి ఉంది. ఇంటిలో చూడగా బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. ఏడు తులాల హారం, నక్లెస్, ఉంగరం, నగదు దోచుకుపోయినట్టు గమనించాడు. సుమారు 25 కాసుల బంగారు, వెండి ఆభరణాలు, రూ. 2 లక్షల నగదు దోచుకుపోయినట్టు తిరుమలరౌతు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఆదివారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పరిశీలించారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం వ్యాపారి హత్య

వరి పొలంలో మృతదేహం పూడ్చివేత



తాతబ్బాయి (ఫైల్)

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి హత్య సంచలనం రేకెత్తించింది. గ్రామానికి చెందిన జల్లిగంపల తాతబ్బాయి (80) బియ్యం వ్యాపారం చేస్తూ గ్రామ ప్రజల మన్నలు పొందారు. శనివారం సాయంత్రం వరకు గ్రామంలో ఉన్న తాతబ్బాయి రాత్రి ఇంటికి రాలేదు. దాంతో తాతబ్బాయి కుటుంబ సభ్యులు గాలించారు. ఆదివారం ఉదయం పొలం గట్టు మీదుగా మనిషిని ఈడ్చుకొంటూ తీసుకు వెళ్లినట్టు గుర్తులు ఉండటంతో పొలంలో గడ్డి కోసుకొనే రైతులు గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దాంతో గ్రామ నాయకులు రాజరాజేశ్వరీ ఆలయ సమీపంలో ఉన్న పొలంలో గాలించారు. వరి పొలం మధ్యలో తాతబ్బాయి మృతదేహన్ని పూడ్చినట్టు గుర్తించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, తలాటం శ్రీను పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్దాపురం డీఎస్పీ లతకుమారి, సీఐ కె.దుర్గాప్రసాద్ తమ సిబ్బందితో ఘటనా ప్రదేశానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. మృతుడు తాతబ్బాయి కుడి చేతికి నాలుగు ఉంగరాలు, మొల సంచి (చిక్కం)లో నగదు ఉంటుందని గ్రామ ప్రజలు తెలిపారు. అయితే ఉంగరాలు, నగదు కోసం తాతబ్బాయిని హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ముమ్మిడివరం: స్థానిక సూరాయి చెరువులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక తాటాకిల్లు పూర్తిగా, మరో తాటాకిల్లు పాక్షికంగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. ఉందుర్తి భాస్కరరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధం కాగా పక్కనే ఉన్న అతని అల్లుడు రాయి శ్రీనివాస్ ఇంటికి పాక్షికంగా నష్టం వాటిల్లింది. ప్రమాదం జరిగి సమయంలో భాస్కరరావు ఇంట్లోనే ఉన్నాడు. అతనిని కాపాడే ప్రయత్నంలో అల్లుడు శ్రీనివాస్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. భాస్కరరావు ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఆ కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు.

ఆదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

ముమ్మిడివరం: ఇంటి నుంచి అదృశ్యమైన యువకుడి మృతదేహం గోదావరిలో లభ్యమైంది. ముమ్మిడివరం నగర పంచాయతీ గంటా వీధికి చెందిన గంటా రాంబాబు(43) ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రాంబాబు అదృశ్యంపై భార్య లక్ష్మీ రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అయితే రాంబాబు మృతదేహం ఆదివారం ఎదుర్లంక గోదావరిలో లభ్యమైంది. ఈ మేరకు ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాంబాబుకు ఒక కుమారుడు ఉన్నాడు.